క్లుప్తంగా

పాఠశాలల్లో తనిఖీలు



గజపతినగరంలోని పాఠశాలలో విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న ఎంఈఓ విమలమ్మ

గజపతినగరం: స్థానిక ఎస్సీ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, ఎన్.జీ.ఆర్.పురం ప్రాథమిక పాఠశాలలో ఎంఈఓ విమలమ్మ గురు వారం తనిఖీలు నిర్వహించారు.ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రికార్డులను, మధ్యాహ్న భోజన వంటకాలను, తాగునీరు ఇతర సదుపాయాలను పరిశీలించారు. లెసన్ ప్లానింగ్ చేసుకొని షెడ్యూలు ప్రకారం బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని పరీక్షించారు. ఎంఈఓ వెంట సీఆర్పీ రెడ్డి ఉన్నారు.

నేత్ర వైద్యశిబిరం



శిబిరంలో సేవలందిస్తున్న వైద్యులు

చీపురుపల్లి: పట్టణానికి చెందిన మానవీయత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధి వంగపల్లిపేటలో గురువారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. బ్రహ్మకుమారీస్ జిల్లా ఇన్‌చార్జి బి.కె.అన్నపూర్ణ, చీపురుపల్లి కేంద్ర ఇన్‌చార్జి బి.కె.శాంతి ఈ శిబిరాన్ని ప్రారంభించారు. గరివిడి లయన్స్ క్లబ్ కంటి ఆస్పత్రి వైద్యులు 62 మందికి నేత్ర పరీక్షలు చేసి 52 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. వీరికి ఉచితంగా ఆపరేషన్ చేయించేందుకు గరివిడి లయన్స్ కంటి ఆస్పత్రికి తరలించామని మానవీయత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు బి.వి.గోవిందరాజులు తెలిపారు. ఎంపీటీసీ గిరడ రాందాసు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ



గర్భిణికి పౌష్టికాహార కిట్‌ను అందజేస్తున్న సర్పంచ్ రాజేశ్వరి

వేపాడ: మండలంలోని వావిలపాడు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం-2లో గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను సర్పంచ్ బీలరాజేశ్వరి గురువారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతల ఆరోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందిస్తోందని, గర్భిణులు విధిగా పౌష్టికాహారం తీసుకుంటే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని అన్నారు. అంగన్‌వాడీ కార్యకర్త, తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న కోతలు వాయిదా వేసుకోండి

జామి: రానున్న రెండు, మూడు రోజుల పాటు మొక్కజొన్న పంట కోతను రైతులు వాయిదా వేసుకోవాలని ఏఓ కిరణ్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో సూచించారు. రెండు రోజులు పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు సూచించిన నేపథ్యంలో రైతులు పంట కోత చేయవద్దని, ఇప్పటికే కోసిన పంటను తడిసి పోకుండా భద్రపరుచుకోవాలని పేర్కొన్నారు. మండలంలో ఏ.ఆర్.పేట, భీమసింగి, ఎం.కె.వలస, కుమరాం, తాండ్రంగి విజినిగిరి, జామి అగ్రహారం తదితర గ్రామాల్లో రబీ మొక్క జొన్న సుమారు వెయ్యి ఎకరాల్లో సాగు చేసినట్లు తెలిపారు.

క్షయ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి



గంట్యాడ: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న టీబీ సూపర్‌వైజర్ శ్రీనివాసరావు

గంట్యాడ/ దత్తిరాజేరు: క్షయ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పెదమజ్జిపాలెం పీహెచ్‌సీ టీబీ సూపర్‌వైజర్ బి. శ్రీనివాస రావు, కె.కొత్తవలస పీహెచ్‌సీ వైద్యాధికారి సంతోషిరూప అన్నారు. గంట్యాడ మండలంలోని తాటిపూడి గిరిజన బాలుర పాఠశాలలో విద్యార్థులకు టీబీ సూపర్‌వైజర్ బి. శ్రీనివాసరావు, మరడాం గ్రామంలో ప్రజలకు వైద్యాధికారి సంతోషిరూప గురువారం క్షయ వ్యాధిపై అవగాహన కల్పించా రు. రెండు వారాలకు మించి దగ్గు ఉన్న వారు క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. క్షయ వ్యాధిగ్రస్తులు దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు చేతి రుమాలు అడ్డుపెట్టుకోవాలని సూచించారు ఎంఎల్‌హెచ్‌పీ విజయలక్ష్మి, హెచ్‌ఎం కె. రామకృష్ణ పట్నాయక్, తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు ఆదర్శ ప్రాయుడు



చీపురుపల్లి: పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న ఆదర్శ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గోవిందరావు, అధ్యాపకులు

చీపురుపల్లి: ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణ త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాముల ప్రతి ఒక్కరికీ ఆదర్శ ప్రాయుడని స్థానిక ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ బి.గోవింద రావు అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతిని ఆ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-2 నేతృత్వంలో గురువారం నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి అధ్యాపకులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు చేసిన నిరాహార దీక్ష చరిత్రలో నిలిచిపోయిందని, ఆయన ప్రాణ త్యాగంతోనే ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందన్నారు. ఎన్ఎస్ఎస్ యూనిట్-2 పీఓ డాక్టర్ బి.విజయేశ్వరరావు, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.జ్వాలాముఖి, అధ్యాపకులు డాక్టర్ పి.మల్లేశ్వర రావు, డాక్టర్ జి.నాగలక్ష్మమ్మ పాల్గొన్నారు.

ఆర్య వైశ్య సంఘాల ఆధ్వర్యంలో..

జామి: పొట్టిశ్రీరాములు జయంతి వేడుకలను మండల కేంద్రంలో ఆర్య వైశ్యసంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. స్థానిక బజారు సెంటర్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘం నేతలు విన్నకోట సీతారామయ్య, పి.శ్రీనివాస రావు, తీగల సతీష్, రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: పట్టణంలో సఆర్యవైశ్యమహాసభ నేతృత్వంలో గురువారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని స్థానిక గాంధీపార్కులో నిర్వహించారు. పార్కు వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి స్థానిక వాసవీ మెగా క్లబ్, వాసవీ మహిళా క్లబ్ సభ్యులు క్షీరాభిషేకం చేశారు. అనంతరం 150 మంది పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమానికి పట్టణానికి చెందిన పలువురు ఆర్యవైశ్యులు హాజరయ్యారు.అలాగే స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర విభాగం ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి సభ నిర్వహించి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ కేశవరావు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రసాధన కోసం ప్రాణాలు అర్పించి శ్రీరాములు నేటికీ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు.

చీపురుపల్లిరూరల్(గరివిడి): ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాన్ని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నా రు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గరివిడి పట్టణంలో పొట్టి శ్రీరాములు జయంతిని గురువారం నిర్వహించారు. ఆర్‌టీబీ వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వి.వి.ఎస్.ఎస్.ఎన్.గుప్త, ఎంపీటీసీ యడ్ల సూర్యారావు, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు సత్యారావు, కోటి, అప్పలరాజు, ధనుంజయ, నరేష్, సాయి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో...

కొత్తవలస: మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో అమర జీవి పొట్టి శ్రీరాములు జయంతిని గురువారం నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులతో కలిసి డిప్యూటీ తహసీల్దార్ హర్షవర్ధిని పూలమాలలు వేసి నివాళులర్పించారు.

లక్కవరపుకోట: స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ దామోదర్ శ్రీధర్, అలాగే జమ్మాదేవిపేట సమీపంలోని మహాత్మ జ్యోతీరావుపూలే ఆశ్రమ బాలికల పాఠశాలలో ప్రిన్సిపాల్ యు.విజయ్‌కుమార్ పాత్రో ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిచారు.

బొండపల్లి: పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఏ.వేదవతి, సిబ్బంది పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సీనియర్ అసిస్టెంట్ డి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం: మండల పరిషత్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి ఇన్‌చార్జి ఎంపీడీఓ పప్పు సుదర్శనం, పంచాయతీ ఇంజినీరింగ్ అధికారి అప్పలనాయుడు, ఏపీఓ సీహెచ్.రామారావు తదితరులుపూలమాలలు వేసి నివాళులర్పించారు.



శృంగవరపుకోట: పొట్టిశ్రీరాములు జయంతి వేడుకల్లో ఆర్యవైశ్యమహా సభ సభ్యులు



కొత్తవలస: పొట్టి శ్రీరాముల విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులతో కలిసి నివాళుర్పిస్తున్న డీటీ హర్షవర్ధిని



శృంగవరపుకోట: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పొట్టి శ్రీరాములు సంస్మరణ సభ



జామి: పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నేతలు



గజపతినగరం: పొట్టి శ్రీరాములు జయంతి వేడుకల్లోఎంపీడీఓ సుదర్శనం, తదితరులు



లక్కవరపుకోట: జ్యోతీరావుపూలే ఆశ్రమ పాఠశాలలో పొట్టిశ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది



బొండపల్లి: పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ వేదవతి, సిబ్బంది



చీపురుపల్లిరూరల్(గరివిడి): పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు



లక్కవరపుకోట: గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు

నవధాన్యాల సాగు.. నేలతల్లి బాగు

కొత్తవలస: నవధాన్యాల సాగుతో భూమి సారవంతమవుతుందని, ప్రకృతి వ్యవసాయంలో భాగంగా రైతులు నవధాన్యాల సాగుపై దృష్టిసారించాలని ప్రకృతి వ్యవసాయం కో-ఆర్డినేటర్ బి.గోవిందరావు అన్నారు. సబల సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని చీడివలస క్లస్టర్ పరిధి గొల్లలపాలెం గ్రామంలో నవ ధాన్యాల విత్తనాల తయారీ, ప్రకృతి వ్యవసాయంపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 రకాల విత్తనాలను ఎకరానికి 10 నుంచి 13 కిలోలు చల్లాలని సూచించారు. 45 రోజుల తర్వాత ఏపుగా పెరిగిన చేనును కలయదున్నడం వల్ల నేల సారవంతమవుతుందని, సూక్ష్మపోషకాలు వృద్ధి చెందుతాయన్నారు. గ్రామైక్య సంఘం అధ్యక్షురాలు ఎన్.కనకమహాలక్ష్మి, భవాని తదితరులు పాల్గొన్నారు.

పొడి భూమిలో సాగుపై అవగాహన

వేపాడ: మండలంలోని కొండగంగుబూడి పంచాయతీ ఎస్.కోట సీతారాంపురంలో సమ్మర్ డ్రై సోయింగ్‌పై (పొడి భూమిలో విత్తనాలు చల్లడం)పై రైతులకు ఏఓ సి.బి.యశ్వంతరావు, సుస్థిర వ్యవసాయ కేంద్రం రీజియన్ కో-ఆర్డినేటర్ పి.వెంకటరావు ఆధ్వర్యంలో గురువారం ప్రయోగాత్మకంగా వివరించారు. నీటి సదుపాయం లేదని పొలాలను ఖాళీగా ఉంచకుండా సమ్మర్ డ్రై సోయింగ్ విధానంలో పంటలు సాగు చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సుస్థిర వ్యవసాయకేంద్రం, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.



కొత్తవలస: రైతులకు నవధాన్యాల విత్తనాలు తయారీపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



వేపాడ: సమ్మర్ డ్రై సోయింగ్‌పై అవగాహన కల్పిస్తున్న ఏఓ యశ్వంతరావు, తదితరులు

పీహెచ్‌సీ భవన నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించండి

- అధికారులకు కలెక్టర్ సూర్యకుమారి ఆదేశం

కొత్తవలస: మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణాల పనులను త్వరితగతిన ప్రారంభించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశించారు. స్థానిక సంత సమీపంలోని గతంలో ఉన్న పీహెచ్‌సీ భవనాలను తొలగించి ఆ ప్రదేశంలో నూతన భవనాల నిర్మాణా నికి ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. సంబంధిత స్థలాన్ని కలెక్టర్ గురువారం పరిశీలించారు. ఈస్థలం పీహెచ్‌సీ నిర్మాణానికి అనువుగా లేదని కొంతమంది ఫిర్యాదు చేయడంతో పరిశీలనకు వచ్చామని కలెక్టర్ తెలిపారు. స్థలం భవన నిర్మాణాలకు అనువుగానే ఉందని, పట్టణం మధ్యలో ఉన్నందున ప్రజలకు అన్ని విధాలా అందుబాటులో ఉంటుందని అన్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలోని ఇప్పటి వరకు భూరీసర్వే ఎంతవరకు పూర్తయిందని రెవెన్యూ ఉద్యోగులను ఆరా తీశారు.డిప్యూటీ తహసీల్దార్ హర్షవర్ధిని మాట్లాడుతూ మండలంలో 19 రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే పనులు చేపడుతున్నామని, ఇప్పటి వరకు మూడు గ్రామాల్లో సర్వే శతశాతం పూర్తియిందని వివరించారు. నిర్దేశించిన గడువులోగా రీసర్వే పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున ఉదయం 11 గంటల వరకు, మళ్లీ మధ్యాహ్నం 3 గంటల నుంచి సర్వే పనులు చేయాలని సిబ్బందికి సూచించారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాలు, ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని, గ్రామాల్లో తాగు నీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బందిని ఆదేశించారు. డీఎంఅండ్‌హెచ్ఓ రమణకుమారి, సీఐ ఎస్.బాలసూర్యారావు, ఎంపీడీఓ వై.పద్మజ తదితరులు పాల్గొన్నారు.



పీహెచ్‌సీ భవనాలు నిర్మించనున్న స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సూర్యకుమారి

పటిష్టంగా 'ఫ్యామిలీ డాక్టర్'



వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎంఅండ్ హెచ్ఓ రమణకుమారి

కొత్తవలస: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంఅండ్‌హెచ్ఓ) ఎస్.వి.రమణ కుమారి వైద్య సిబ్బందికి సూచించారు. మండలంలోని ఉత్తరాపల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ముందుగా నిర్వహించిన శిబిరంలో ఓపీ ఎంత నమోదైంది, గర్భిణులకు ఎతమంది పరీక్షలు చేశారు..? వారిలో హైరిస్క్ గర్భిణులు ఎంత మంది ఉన్నారని వైద్యులు టి.వెంకటరావు, సి.సి.స్వామిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించే గ్రామాల్లోని అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలలను సందర్శించాలని వైద్యులకు సూచించారు. ప్రతీ గురువారం ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలతో రక్తహీనత రాకుండా ఐరన్ ఫోలిక్ మాత్రలను మింగించాలన్నారు. వేసవిలో వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యుడు సింహాద్రినాయుడు, ఎంపీహెచ్ఈఓ గోవిందరాజులు, హెల్త్ అసిస్టెంట్ సత్యారావు పాల్గొన్నారు.

సచివాలయం సందర్శన



సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీఓ పట్నాయిక్

వేపాడ: మండలంలోని నల్లబిల్లి గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ కె.ఎస్.ఎన్.పట్నాయక్, ఈఓపీఆర్డీ సూర్యనారాయణ గురువారం సందర్శించారు. సిబ్బంది హాజరు, మూమెంట్, తదితర రికార్డులను తనిఖీ చేశారు. సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలలో ఎన్నింటిని పరిష్కరించారని సిబ్బందిని ఆరా తీశారు. ఇంటిపన్ను వసూళ్లు శతశాతం పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

కొత్తవలస: మండలంలోని అప్పన్నదొరపాలెం గ్రామం సమీపంలో గల కొండ ప్రాంతంలో దారపోడితల్లిమ్మ గుడి సమీపంలో రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై సీఐ ఎస్.బాలసూర్యారావు సిబ్బందితో కలిసి గురువారం దాడి చేశారు. ఈ సందర్భంగా అక్కడ పేకాట ఆడుతున్న 10 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.10,400 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

సత్తాచాటిన గురుకుల విద్యార్థులు



విద్యార్థులతో ప్రిన్సిపాల్ సీతారాం

దత్తిరాజేరు: రాష్ట్రస్థాయి 49వ మ్యాథమెటికల్ ఒలింపియాడ్-2022లో మండలంలోని కోరపు కొత్తవలసలోని మహాత్మా జ్యోతీరావు పూలే గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. ప్రిన్సిపాల్ సీతారాం గురువారం మాట్లాడుతూ గత ఏడాది నవంబర్‌లో పాఠశాలలో నిర్వహించిన మ్యాథమెటికల్ ఒలింపియాడ్‌కు సంబంధించిన ఫలితాలు తాజాగా వెలువడ్డాయని చెప్పారు. ఈ ఒలింపియాడ్‌లో సబ్ జూనియర్ విభాగంలో గురుకులానికి చెందిన 7వ తరగతి విద్యార్థి పవన్‌కుమార్‌కు 2వ ర్యాంక్, 6వ తరగతి విద్యార్థి అనంత్ నాయుడుకు 9వ ర్యాంకు వచ్చిందని తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

సంచార పశువైద్యసేవలను వినియోగించుకోండి



వేపాడ: చినగుడిపాలలో పశువులకు గర్భకోశ చికిత్స చేస్తున్న ఏడీఏ చలపతిరావు



లక్కవరపుకోట: పశువులకు వైద్యసేవలందిస్తున్న డాక్టర్ గాయత్రీదేవి

వేపాడ: మూగజీవాల కోసం ప్రభుత్వం వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవలను అందుబాటులోకి తెచ్చిందని, ఈ సేవలను పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్.కోట పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ బి.చలపతిరావు సూచించారు. మండలంలోని చినగుడిపాల గ్రామంలో గురువారం ఉచిత పశువైద్యశిబిరం నిర్వహించారు. 40 పశువులకు గర్భకోశ చికిత్సలు, 105 పశువులకు సాధారణచికిత్స చేసి మందులు అందజేశారు.50లేగ దూడలకు ఏలిక పాముల నివారణ మందులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులు, మూగజీవాలకు ఆరోగ్య సమస్యలు తలెత్తి, అత్యవసర వైద్యసేవలు అవసరమైనప్పు డు రైతులు 1962 నంబర్‌కు ఫోన్‌చేస్తే అంబులెన్స్‌తో సిబ్బంది వచ్చి సేవలందిస్తారని చెప్పారు. పశు విజ్ఞాన బడి కార్యక్రమంపై అవగాహన కల్పించారు. వేపాడ పశువైద్యాధికారి సింహాచలం నాయుడు, సూపర్‌వైజర్ నాయుడు, ఏహెచ్ఎలు సతీష్, కాంతారావు, గోపాలమిత్రలు సింహాద్రప్పడు తదితరులు పాల్గొన్నారు.

75 శాతం రాయితీపై పశుగ్రాస విత్తనాలు

లక్కవరపుకోట: పాడి రైతులకు 75 శాతం రాయితీపై అందించేందుకు పశుగ్రాసం విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని ఎల్.కోట పశువైద్యాధికారి గాయత్రీదేవి తెలిపారు. మండలంలోని మార్లాపల్లి గ్రామంలో గురువారం పశువైద్య శిబిరం నిర్వహించారు. 25 పశువులకు చూడిద తనికీలు చేశారు. ఎదకు రాని పశువులు, తిరిగి పొర్లుతున్న పశువులు, గర్భకోశ వ్యాధి ఉన్న పశువులకు చికిత్స చేశారు. 300 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. పశువైద్య సహాయకులు పాల్గొన్నారు.

ఘనంగా బంగారమ్మ తల్లి తీర్థం



జామి: పూజలందుకుంటున్న బంగారమ్మతల్లి



జామి: ఎడ్ల పరుగు పోటీలు

జామి: మండలంలోని తాండ్రంగి గ్రామంలో బంగారమ్మ తల్లి తీర్థం గురువారం ఘనంగా నిర్వహించారు అమ్మవారిని భక్తులు వేకువ జాము నుంచి దర్శించుకుని పసుపు, కుంకమ సమర్పించుకున్నారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. కోలాటం తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుంగా గ్రామపెద్దలు కరక దశరథ, వేచలపు విజయ్‌కుమార్, గేదెల శ్రీనివాస్, బీల వెంకటరావు, సీతారాం తదితరులు తగిన ఏర్పాట్లు చేయించారు.

ఎడ్ల పరుగుపోటీలు

తీర్థంగా సందర్భంగా నిర్వహించిన ఎడ్ల బళ్ల పరుగు పోటీలు ఉత్సాహంగా సాగాయి. పోటీల్లో మొత్తం 15 ఎడ్ల బళ్లు పాల్గొనగా..మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన వారికి నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. పోటీలను తిలకించడానికి చుట్టు పక్క గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

అభయాంజనేయ స్వామి తీర్థం

వేపాడ: మండలంలోని బొద్దాం గ్రామంలో అభయాంజనేయ స్వామి తీర్థం గురువారం వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.తీర్థం సందర్భంగా సాయంత్రం నిర్వహించిన గుర్రాల పరుగు ప్రదర్శన ఉల్లాసంగా..ఉత్సాహంగా సాగింది. మొదటి ఆరు స్థానాల్లో నిలిచిన గుర్రాలకు సంబంధించిన యజమానులకు డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు, జెడ్పీటీసీ ఎస్.అప్పారావు, గ్రామపెద్ద ఎర్రా సన్యాసిరావు, కండిపల్లి పెదనాయుడు చేతులు మీదుగా నగదు బహుమతులు అందజేశారు.



వేపాడ: బొద్దాంలో గుర్రాల పరుగు పోటీల్లో విజేతలకు నగదు బహుమతి అందచేస్తున్న డీసీసీబీ చైర్మన్ చినరామునాయుడు, తదితరులు

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

వేపాడ: ఇంటర్మీడియట్ ద్వితీయసంవత్సరం పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పరీక్షా కేంద్రంలో 275 మంది విద్యార్థులు పరీక్షరాయాల్సి ఉండగా, 259 మంది హాజరయ్యారని 16 మంది గైర్హాజరయ్యారని సీఎస్ బోజంకి సింహాద్రప్పడు తెలిపారు.

23 మంది గైర్హాజరు

గజపతినగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, స్థానిక శ్రీకృష్ణ కళాశాల కేంద్రాలుగా గురువారం ప్రారంభమైన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు తొలిరోజు ప్రశాంతంగా ముగిసింది. గజపతినగరం డిగ్రీ కళాశాలలో 392 మంది పరీక్షరాయాల్సి ఉండగా 11మంది, శ్రీకృష్ణ కళాశాలలో 273 మందికి 12మంది గైర్హాజరయ్యారని పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్‌లు సీహెచ్.విజయకుమారి, పి.పుల్లయ్య తెలిపారు.



గజపతినగరం : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు



వేపాడ: పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు